సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 17 । మార్చి । 2025



ఇచ్చేది పదుల్లో.. ఖర్చు వందల్లో

ప్రభుత్వం అరకొరగా సొమ్ము కేటాయించడంతో టెన్త్ పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్లకు, డిపార్ట్‌మెంటల్ అధికారులకు పరీక్షగా మారుతోంది.

8లో



డెల్టాలకు నీటి విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి నీటిని విడుదల చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహర్ మంగళవారం (ఉదయం)
రాజమండ్రి	6.22	4.49
కాకినాడ	6.22	4.48
అమలాపురం	6.22	4.48

న్యూస్‌రీల్

శతాధిక వృద్ధురాలి మృతి



గొవ్వాల సూర్యకాంతం (ఫైల్)

అమలాపురం టౌన్: స్థానిక 22వ వార్డు పరిధిలోని గొవ్వాలవారి వీధికి చెందిన శతాధిక వృద్ధురాలు గొవ్వాల సూర్యకాంతం (110) ఆదివారం మృతి చెందారు. ఈమె 22వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్, వైఎస్సార్ సీపీ నాయకుడు గొవ్వాల రాజేష్ నానమ్మ. మూడు నెలల కిందటి వరకూ నానమ్మ ఏ ఒక్కరి సాయం లేకుండానే తన పనులు తాను చేసుకుంటూ జీవించిందని రాజేష్ తెలిపారు. మూడు నెలలగా మంచాన పడి చివరకు వృద్ధాప్యంతో మృతి చెందిందన్నారు. సూర్యకాంతానికి ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, దాదాపు 40 మంది వరకూ మనుమలు, మునిమనుమలు ఉన్నారు.

అయినవిల్లికి భక్తుల తాకిడి

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీ గణపతి హోమం, గరిక పూజ వంటి విశేష పూజలు జరిపారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించారు. మహానివేదన చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 56 మంది, శ్రీ లక్ష్మీగణపతి హోమంలో 31 జంటలు, స్వామివారి పంచామృతాభిషేకాలో ఒక జంట, స్వామివారి గరిక పూజలో రెండు జంటలు పాల్గొన్నాయి. పది మంది భక్తులు స్వామికి ఉండ్రాళ్ల పూజలు జరిపారు. స్వామివారి సన్నిధిలో 11 మంది చిన్నారులకు అక్షరాభ్యాసాలు, ఐదుగురు చిన్నారులకు అన్నప్రాశనలు, ముగ్గురు చిన్నారులకు నామకరణం, 13 మందికి తులాభారం చేశారు. స్వామికి 16 మంది తలనీలాలు సమర్పించారు. 25 నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేశారు. 3,510 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్కరోజు స్వామివారికి వివిధ పూజా టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.2,93,437 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

21న విద్యా విజ్ఞాన విహార యాత్ర

ముమ్మిడివరం: జిల్లా విద్యాశాఖ అధ్వర్యంలో ఈ నెల 21న విద్యా విజ్ఞాన విహార యాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. విద్యార్థుల విజ్ఞానాన్ని అభివృద్ధి చేయడం, శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంచడం లక్ష్యంగా ఈ యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. డీఎస్ఓ జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఏఎంవో రాంబాబు, 116 మంది సెకండరీ విద్యార్థులు, 15 మంది ఉపాధ్యాయులతో కూడిన బృందం ఈ యాత్రలో పాల్గొంటుందన్నారు. తిరుపతి ఐఐటీ, తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్, తిరుపతి జంతు ప్రదర్శన శాలలు, తిరుపతి వెటర్నరీ యూనివర్సిటీ, చంద్రగిరి కోట, తూర్పు, పశ్చిమ గోదావరి పరివాహక ప్రాంతాలు, కోరంగి అభయారణ్యం, యానాం కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ యాత్ర ఉంటుందన్నారు. యాత్రలో పాల్గొనే విద్యార్థులు తల్లిదండ్రుల అనుమతి పత్రంతోనే రావాల్సి ఉంటుందన్నారు. విద్యార్థుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మండల విద్యాశాఖాధికారులు ఈ పర్యటనను పర్యవేక్షిస్తుంటారన్నారు. ఈ యాత్ర విద్యార్థులకు వినూత్నమైన అవగాహనను అందించడంతో పాటు వారి భవిష్యత్ ప్రయాణానికి మార్గ దర్శకంగా నిలుస్తుందని విద్యాశాఖాధికారి షేక్ సలీం బాషా తెలిపారు.

యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

అమలాపురం రూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా కలెక్టరేట్ గోదావరిభవన్‌లో జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు.

రత్నగిరికి భక్తుల వెల్లువ

అన్నవరం: రత్నగిరికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. సత్యదేవుని ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. స్వామివారిని మొత్తం 40 వేల మంది దర్శించగా, వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్నప్రసాదాన్ని సుమారు 5 వేల మంది భక్తులు స్వీకరించారు.

గౌరవ యాతన



- వలంటీర్లకు కూటమి వంచన
- రూ.10 వేల గౌరవ వేతనమంటూ హామీ
- అధికారంలోకి వచ్చాక అమలు దాటవేత
- ఆవిర్భావ సభలో ప్రస్తావించని పవన్
- పాతికేళ్ల భవిష్యత్ అంటే ఇదేనా అంటున్న వలంటీర్లు
- చట్టపరమైన సమస్యలొస్తాయంటున్న మంత్రి లోకేశ్
- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వలంటీర్ల ఉద్యమాలు
- నేడు 'చలో విజయవాడ'

కపిలేశ్వరపురం: సంక్షేమం, అభివృద్ధి కూటమి అజెండా, ప్రపంచంలో ఆంధ్ర రాష్ట్రానికి పేరు తెస్తా, పాతిక కేజీల బియ్యం కావాలా? పాతికేళ్ల భవిష్యత్ కావాలా.. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాల భర్తీ.. ఏటా జనవరి 1న ఉద్యోగ క్యాలెండర్ విడుదల.. వలంటీర్ల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంపు.. ఇవీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీలతో కూడిన కూటమి నేతలు చెప్పిన మాటలు. ఆయా లక్ష్యాలను అప్పటికే సాధించే క్రమంలో కొనసాగుతున్న వైఎస్సార్ సీపీ సంక్షేమ ప్రభుత్వాన్ని ఓడించేందుకు కూటమి పన్నిన కుట్రలో భాగంగా వెదజల్లిన హామీలవి. కారణాలేవైనా కూటమి ప్రభుత్వం వచ్చింది. ఉద్యోగాలు ఇవ్వడం సంగతి పక్కన పెట్టి అప్పటికే పేదలకు సేవలందిస్తున్న వలంటీర్లను విధుల నుంచి పక్కన పెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 2.60 లక్షల మంది వలంటీర్లు విధులు నిర్వహించేవారు. వారికి రూ.10 వేల వేతనం మాట దేవుడెరుగు ఉన్న ఉపాధినే ఊడపీకేశారు. వలంటీర్ల తొలగింపు కేవలం వారి కుటుంబాలకే కాదు యావత్ ఆంధ్ర ప్రజలకూ యాతనే. తెల్లవారుజామునే పింఛను అందజేత నుంచి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, దరఖాస్తు చేయించడం, మొత్తంగా లబ్ధి వారి ఖాతాలకు జమ చేయించడమూ... ఇలాంటి సేవలన్నీ మూలన పడ్డాయి. దీంతో వలంటీర్లు సంఘం కట్టి తమను విధుల్లోకి తీసుకోవాలంటూ పోరాడుతున్నారు.

సేవలు అమోఘం

ప్రస్తుతం తూర్పు గోదావరి జిల్లాలో 2,36,331 మంది, కాకినాడ జిల్లాలో 2,72,437, అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2,37,244 మంది కలిపి మొత్తం 7,46,012 మంది వివిధ సామాజిక పింఛన్లు అందుకుంటున్నారు. వీరంతా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పింఛను మంజూరైనవారే. వారందరికీ ప్రతి నెలా 1వ తేదీ తెల్లవారుజామున 6 గంటలకే వలంటీర్లు పింఛన్లు అందజేసేవారు. దీంతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలు అర్హులకు అందేలా కృషి చేశారు. కరోనా విపత్కర సమయంలో ప్రాణాలకు తెగించి ప్రభుత్వం అప్పగించిన సేవా కార్యక్రమాల్లో విధులు నిర్వహించారు. తుపాన్లు, వరదల సమయాల్లో కోనసీమ, తూర్పు గోదావరి నదీతీర లంక గ్రామాల్లోని బాధితులకు తాగునీరు, నిత్యావసర సరకులు, ఆహార పొట్లాలు పడవల్లో దరి చేర్చేవారు.

వలంటీర్ల తొలగింపు ప్రభావమిలా...


'ఉమ్మడి' జిల్లాలోని 1,644 వార్డు, గ్రామ సచివాలయాలకు అనుసంధానంగా వలంటీర్లుండేవారు. వారు లేకపోవడంతో లబ్ధిదారులకు ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛను అందజేయడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డ మొదటి నెలలో వలంటీర్లు లేకుండానే పింఛన్లు పంచగలమన్నది ప్రకటనలకే పరిమితమైంది. అప్పుడు సైతం లబ్ధిదారులను పంచాయతీ కార్యాలయానికి లేదా కూడలికి రమ్మని సచివాలయ ఉద్యోగులతో పంపిణీ చేశారు. ఇక రెండో నెల నుంచి వలంటీర్ల మాదిరిగా పింఛను ఇచ్చిన తీరు కానరాలేదు. వలంటీర్లు లేక సచివాలయ ఉద్యోగులపై పని ఒత్తిడి పెరిగింది. చేస్తున్న సర్వేల్లో సేవల్లో నాణ్యత కొరవడుతోందన్న వాదన ఉంది.

వలంటీర్లను విస్మరించిన కూటమి ప్రభుత్వం

వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతామన్న హామీకి అధికారంలోకి వచ్చాక కూటమి తూట్లు పొడిచింది. వారికి ఒక్క రూపాయి కూడా మేలు చేసింది లేదు. ఐదేళ్లు సేవలందించిన తమను విస్మరించవద్దంటూ ప్రభుత్వాన్ని వలంటీర్లు వేడుకున్నారు. ప్రభుత్వం వినకపోవడంతో పోరాటబాట పట్టారు. కూటమి అధికారంలోకి వస్తే కేవలం పాతిక కిలోల చొప్పున బియ్యం ఇవ్వడం కాదు పాతికేళ్ల భవిష్యత్ ఇస్తామన్న పవన్ కల్యాణ్‌ను ప్రశ్నిస్తున్నారు. పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించిన జనసేన 12వ ఆవిర్భావ సభలో తమకు ఇచ్చిన హామీ గురించి ప్రస్తావించకపోవడంపై వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్లను విధుల్లోకి తీసుకుంటే చట్టపరమైన సమస్యలొస్తాయని మంత్రి లోకేశ్ అసెంబ్లీలో ప్రకటించడంపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని హామీ ఇచ్చేటప్పుడు ఈ విషయం ఆయనకు తెలియదా అని ప్రశ్నిస్తున్నారు. 2025–26 వార్షిక బడ్జెట్‌లో వలంటీర్లకు సంబంధించి నిధులను కేటాయించకపోవడంపై సీఎం చంద్రబాబుపై మండిపడుతున్నారు.

'ఉమ్మడి' జిల్లా వలంటీర్ల ఉద్యమాలిలా..

2024 నవంబర్ 9న రాష్ట్ర రాజధానిలో 'వలంటీర్ల ఆవేదన సదస్సు'ను నిర్వహించారు. అదే ఏడాది నవంబర్ 3న అమలాపురంలో జిల్లా స్థాయి నిరసన సమావేశం నిర్వహించారు. 2024 డిసెంబర్ 10న కాకినాడ సూర్యకళా మందిరంలో వైఎస్సార్ సీపీ ఉమ్మడి జిల్లా స్థాయి సమావేశంలో వలంటీర్ల ఆందోళనకు పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ ఏడాది జనవరి 17న విజయవాడలో నిర్వహించిన సచివాలయ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనకుండా వలంటీర్లను కూటమి ప్రభుత్వం నిర్బంధించింది. 2025 ఫిబ్రవరి 5న అమలాపురం కలెక్టరేట్ ఎదుట వలంటీర్లు ధర్నా చేశారు. ఈ నెల 12న వైఎస్సార్ సీపీ యువత పోరులో వలంటీర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సోమవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్ వద్ద ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తలపెట్టిన నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు 'ఉమ్మడి' జిల్లాలోని వలంటీర్లు సమాయత్తమయ్యారు.



వలంటీర్లు నష్టపోయారిలా..

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఒక్కో వలంటీర్‌కు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం ఇచ్చేది. దీని ప్రకారం కాకినాడ జిల్లాలో 12,272 మంది వలంటీర్లు ప్రతి నెలా రూ.6,13,60,000, కోనసీమ జిల్లాలో 9,581 మంది వలంటీర్లు రూ.4,79,05,000, తూర్పుగోదావరి జిల్లాలో 9,034 మంది వలంటీర్లు రూ.4,51,70,000 చొప్పున అందుకునేవారు. మూడు జిల్లాలు కలిపి రూ.15,44,35,000 మేర వలంటీర్లకు వేతనం అందేది. దీని ప్రకారం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడచిన 9 నెలల్లో వారు రూ.138,99,15,000 మేర నష్టపోయారు.
- అదే చంద్రబాబు అండ్ కో ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి నెలా రూ.10 వేల వేతనం లెక్కేసుకుంటే 9 నెలల్లో కాకినాడ జిల్లా వలంటీర్లు రూ.110,44,80,000, కోనసీమ జిల్లా వలంటీర్లు రూ.86,22,90,000, తూర్పు గోదావరి జిల్లా వలంటీర్లు రూ.81,30,60,000 కలిపి మొత్తం రూ.277,98,30,000 మేర వేతనాలు కోల్పోయారు.



తమను విధుల్లోకి తీసుకోవాలంటూ కేదారిలంకలో ఈ ఏడాది జనవరి 2న ఎన్టీఆర్ చిత్రపటానికి వినతిపత్రం అందజేస్తున్న వలంటీర్లు

హామీని విస్మరించడం వలంటీర్లను వంచించడమే..



ఎన్నికల సమయంలో వలంటీర్లను కొనసాగిస్తామని, రూ.10వేలకు గౌరవ వేతనం పెంచుతామంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక హామీని విస్మరించడం వలంటీర్లను వంచించడమే అవుతుంది. ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాల అమలుతో పాటు ప్రకృతి విపత్తుల సమయాల్లో వలంటీర్లు విశేష సేవలందించారు. వారి సేవలను గుర్తించైనా విధుల్లోకి తీసుకోవాలి.

– నూకల బలరాం, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, కోనసీమ జిల్లా

అమరజీవి త్యాగం చిరస్మరణీయం



కలెక్టరేట్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏవో కాశీ విశ్వేశ్వరరావు

అమలాపురం రూరల్: భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని కలెక్టర్ కార్యాలయం పరిపాలనాధికారి కడలి కాశీ విశ్వేశ్వరరావు పేర్కొన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. ఆయన పోరాట పటిమను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఆయన త్యాగ ఫలితంగా 1956 నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని కొనియాడారు. భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు శ్రీరాములు ఆద్యులన్నారు. తెలుగు రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శమన్నారు అమరజీవి పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం అందరం పునరంకితమవుదామన్నారు. రెవెన్యూ ఉద్యోగులు కృష్ణకాంత్, శేఖర్ ప్రదీప్, జి.రాజు పాల్గొన్నారు.

బిల్లులు విడుదల చేయండి బాబూ..



రావులపాలెంలో సమావేశం అయిన ఉమ్మడి జిల్లాల కాంట్రాక్టర్లు

- ఉభయ గోదావరి జిల్లాల కాంట్రాక్టర్ల అసోసియేషన్ సమావేశం
- 19, 21 తేదీల్లో వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయం

రావులపాలెం: ఎక్కడెక్కడో అప్పులు చేసి రోడ్లు, భవనాలు నిర్మించామని వాటి బిల్లులు రావడం ఆలస్యం కావడంతో ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంఘ సభ్యులు కోరారు. రావులపాలెంలోని అసోసియేషన్ భవనంలో ఆదివారం రెండు జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లు సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న గుంతలు లేని రహదారులు కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా రాష్ట్రంలోని రహదారులకు మరమ్మతు పనులు పూర్తి చేశామన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడం వాస్తవమేనని, కానీ తాము బయట అప్పులు చేసి తీసుకువచ్చి నిర్మాణాలు చేపట్టామని, వాటికి వడ్డీలు చెల్లిస్తున్నామన్నారు. ప్రభుత్వ అర్థం చేసుకుని ఈ నెలాఖరుకు పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని కోరారు. కొంతమందికి మాత్రమే బిల్లులు విడుదల చేస్తున్నారని, ప్రయారిటీ ప్రకారం విడుదల చేయాలని కోరారు. తమ సమస్యలపై నిరసన తెలిపేందుకు ఈ నెల 19వ తేదీన పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపాలిటీ ఎస్ఈ కార్యాలయం వద్ద, 21న తూర్పుగోదావరి జిల్లా కాకినాడ పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, మున్సిపాలిటీ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నాలు నిర్వహించి వినతి పత్రాలు ఇస్తామన్నారు. బిల్లులు విడుదల చేయకపోతే ఒకటో తేదీన సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం



పరీక్షలకు సిద్ధం అంటున్న విద్యార్థులు

రాయవరం: జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా 9,624 మంది బాలురు, 9,593 మంది బాలికలు పరీక్షలు రాస్తారు. మూడు సమస్యాత్మక పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షలు జరిగే సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. పరీక్షా కేంద్రానికి 200 మీటర్ల దూరం వరకు జిరాక్స్ సెంటర్లు మూసి వేసి ఉంచాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రానికి విద్యార్థులు గంట ముందుగానే చేరుకోవాలని సూచిస్తున్నారు. డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా ప్రత్యేకాధికారిగా నియమితులైన ఇన్‌ఫ్రా జాయింట్ డైరెక్టర్ ముమ్మా రామలింగం ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సీఎస్, డీవోలు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో ఇప్పటికే గూగుల్ మీట్ నిర్వహించి, అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.

కేటగిరీల వారీగా పరీక్షా కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా 110 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో 'ఏ' సెంటర్ ఒక్కటి కూడా లేదు. 59 'బి' సెంటర్లు, 51 'సి' సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 19,217 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా, వీరిలో 16,419 మంది రెగ్యులర్, 2,518 మంది రెగ్యులర్ ఒకేషనల్, ఓఎస్ఎస్సీ ప్రైవేట్ ఒక్కరు, ఓఎస్ఎస్సీ రెగ్యులర్ 73, ఫెయిల్డ్ విద్యార్థులు 206 మంది ఉన్నారు. గతేడాది మాదిరిగానే ఆరు సబ్జెక్టులకు ఏడు పరీక్షలు ఉంటాయి. పరీక్షకు పరీక్షకు మధ్య ఒక రోజు విరామం ఇచ్చారు. ఫిజికల్ సైన్స్, బయాలాజికల్ సైన్స్ పరీక్ష మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు కొనసాగుతుంది.

నో మొబైల్ జోన్లుగా పరీక్షా కేంద్రాలు

మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష పేపరుపై ఏడు అంకెల సిరీస్‌లో నంబర్‌ను ముద్రించారు. దీని వల్ల ఏ పరీక్షా కేంద్రంలో, ఏ ఇన్విజిలేటర్ ద్వారా, ఏ విద్యార్థి ద్వారా ప్రశ్నపత్రం బయటకు వెళ్లినా విషయం నిమిషాల వ్యవధిలో అధికారులకు తెలుస్తుంది. పది పరీక్షా కేంద్రాలను నో మొబైల్ జోన్లుగా ప్రకటించారు. పరీక్షా కేంద్రంలోకి సీఎస్, డీవోలు, ఇన్విజిలేటర్లు, విద్యార్థులు సెల్ ఫోన్ తీసు కువెళ్లడానికి అనుమతి లేదు. వీరంతా పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసుల వద్ద సెల్‌ఫోన్స్ డిపాజిట్ చేయాలి. అత్యవసరమైతే సీఎస్ పోలీసుల సమక్షంలోనే పై అధికారులతో ఫోన్ మాట్లాడి, తిరిగి మొబైల్ అక్కడే డిపాజిట్ చేయాలి. ప్రతి ఒక్కరూ విధిగా ప్రభుత్వ గుర్తింపు కార్డును దగ్గర ఉంచుకోవాలి. ఐదు ఫ్లయింగ్ స్క్వాడ్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులు సివిల్ డ్రెస్ ధరించి మాత్రమే పరీక్షకు హాజరు కావాలి. హాల్ టికెట్ చూపించి విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసే అవకాశం కల్పించారు.

హెల్ప్ డెస్క్ ఏర్పాటు

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో ఏవైనా ఇబ్బందులు తలెత్తితే విద్యార్థులు, తల్లితండ్రులు 9493819102 నంబరులో సంప్రదించవచ్చు.

బాలాజీకి రూ.1.88 లక్షల ఆదాయం



బాల బాలాజీ స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామివారికి ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరాలని స్వామి వారిని వేడుకున్నారు. ఆపద మొక్కుల వాడా.. అనాథ రక్షకా.. గోవిందా, గోవిందా అంటూ శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకుని ఆనంద పరవశులయ్యారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,88,511 ఆదాయం వచ్చింది. స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.43,277 విరాళంగా అందించారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.27,600 ఆదాయం వచ్చింది. స్వామి వారిని 3,500 మంది భక్తులు దర్శించుకున్నారు. 1,500 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు.

ఇచ్చేది పదుల్లో.. ఖర్చు వందల్లో

- పది పరీక్షల నిర్వహణపై ప్రభుత్వం చిన్నచూపు
- 2023లో పెంచిన జగన్ సర్కార్
- ఒక విద్యార్థికి ప్రస్తుతం ఇస్తున్న కంటింజెంట్ చార్జీ రూ.10
- రెమ్యూనరేషన్ పెంచాలంటున్న యూనియన్లు


పది పరీక్షల్లో వినియోగించే కంటింజెంట్ సామగ్రి

రాయవరం: పదవ తరగతి పరీక్షల నిర్వహణ చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు పరీక్షగా మారుతోంది. ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు కేటాయించే సొమ్ము ఒక్కో విద్యార్థికి రూ.పదుల్లో ఉంటుండగా, ఖర్చు రూ.వందల్లో అవుతుందనే విమర్శలున్నాయి. ఎంకి పెళ్లి సుబ్బి చావుకు వచ్చిందన్న చందంగా పరీక్షల నిర్వహణ ఖర్చుల భారం ఉంటోందని పలువురు చీఫ్‌లు, డీవోలు వాపోతున్నారు. ఇప్పటికే పరీక్షల నిర్వహణ కేటాయింపులు పెంచాలని, ఇన్విజిలేటర్లకు ఇచ్చే రెమ్యూనరేషన్‌ను పెంచాలని ప్రభుత్వాన్ని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఇంటర్ పరీక్షలకు ఇచ్చే విధంగా రెమ్యునరేషన్ ఉండాలనే డిమాండ్ ఉపాధ్యాయుల నుంచి విన్పిస్తోంది.

ఒక్కో విద్యార్థికి రూ.1.42 కేటాయింపు

పరీక్షల నిర్వహణకు ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.1.42 వంతున ఏడు పరీక్షలకు రూ.10 మంజూరు చేస్తున్నారు. 2018లో ఒక్కో విద్యార్థికి కంటింజెంట్ చార్జీగా రూ.5.50 ఇవ్వగా, 2023లో ఒక్కో విద్యార్థికి రూ.8 ఇస్తున్న కంటింజెంట్ చార్జీని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.8 నుంచి రూ.10కి పెంచింది. ప్రస్తుతం పెరిగిన నిత్యావసర వస్తువులను దృష్టిలో ఉంచుకుని కంటింజెంట్ చార్జీలను పెంచాలనే డిమాండ్‌ను ఉపాధ్యాయ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. పరీక్ష కేంద్రంలో పరీక్షలను పర్యవేక్షించే చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ అధికారి పోలీస్ స్టేషన్ నుంచి పరీక్షా పత్రాలు తీసుకువచ్చి పరీక్ష అనంతరం సమాధాన పత్రాలను సీల్ చేస్తారు. ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలకు వేర్వేరుగా సంచులు వాడతారు. ఒక్కో సంచికి రెండు నుంచి మూడు మీటర్ల వస్త్రాన్ని, జవాబు పత్రాలను పోస్టాఫీసుకు తీసుకుని వెళ్లడానికి రవాణా ఖర్చులను భరించాల్సి వస్తోంది. జవాబు పత్రాలను కట్టి భద్రపరిచేందుకు లక్క, కొవ్వొత్తి, దారం, స్కెచ్ పెన్నులు, స్టాప్లర్లు, గమ్, వైట్‌నర్ తదితర వస్తువులను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు పరీక్షా కేంద్రంలో మంచినీరును అందుబాటులో ఉంచాలి. ఇలా అన్ని వస్తువులను కొనాలంటే ఎంతలేదన్నా రోజుకు రూ.600కు పైగా ఖర్చవుతుందని చీఫ్‌లు చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రూ.1.42 ఇస్తే ఎలా సరిపోతుందని ప్రశ్నిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో ఉన్న పరీక్షా కేంద్రాలు :	386
హాజరయ్యే విద్యార్థులు :	73,329
చీఫ్, డీవో, కస్టోడియన్లకు రోజుకు ఇచ్చేది :	రూ. 66
ఇన్విజిలేటర్లకు రోజుకు ఇచ్చేది :	రూ.33
క్లర్కులకు రోజుకు ఇచ్చేది :	రూ. 33
అటెండర్‌కు ఇచ్చేది :	రూ.20
వాటర్ మెన్లకు రోజుకు ఇచ్చేది :	రూ.17

సీఎస్‌లపైనే ఆర్థిక భారం

ప్రతి పరీక్షా కేంద్రంలో నిర్వహణ బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పదవ తరగతి పరీక్షకు 386 మంది చీఫ్‌లు హాజరవుతున్నారు. ప్రభుత్వం నిధులను తక్కువగా విడుదల చేస్తుండడంతో అదనంగా అయ్యే ఖర్చును వారి చేతి నుంచి ఖర్చు పెట్టాల్సి వస్తోంది. రోజుకు రూ.200 నుంచి రూ.300 వరకు అదనంగా భరించాల్సి ఉంటుందని పలువురు చీఫ్‌లు చెబుతున్నారు. ఒక్కో విద్యార్థికి కనీసం రూ.15 ఇవ్వాలని, అదనంగా రవాణా చార్జీలు మంజూరు చేయాలని చీఫ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

ఇన్విజిలేటర్లకూ అంతంత మాత్రమే

ఇంటర్ పరీక్షల్లో ఇన్విజిలేటర్లకు రోజుకు రూ.150 వంతున రెమ్యూనరేషన్ ఇస్తుండగా, పదవ తరగతి ఇన్విజిలేషన్‌కు మాత్రం రోజుకు కేవలం రూ.33 ఇస్తున్నారు. అటెండర్‌కు రూ.20, వాటర్ బాయ్‌కి రూ.17 వంతున భృతిని చెల్లిస్తున్నారు. గత ప్రభుత్వం అంతకుముందు కంటే సీఎస్, డీవోలకు రూ.22, ఇన్విజిలేటర్లు, క్లర్క్‌కు రూ.11, అటెండర్లకు రూ.6.80, వాటర్‌మెన్‌కు రూ.6 వంతున పెంపుదల చేసింది. కాగా ఇంటర్ పరీక్షలకు, పది పరీక్షలకు పెద్దగా తేడా లేకున్నా, రెమ్యూనరేషన్ చెల్లింపులో మాత్రం తీవ్ర వ్యత్యాసం కనిపిస్తోందని ఉపాధ్యాయులు వాపోతున్నారు. పెరుగుతున్న ధరలకు తోడు సరిపడా నిర్వహణ ఖర్చులు మంజూరు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు ఇన్విజిలేటర్లు ఆవేదన చెందుతున్నారు. ఫీజుల వసూలు విషయానికి వస్తే మాత్రం ఒక్కో విద్యార్థి నుంచి రూ.125 వంతున వసూలు చేస్తున్నారు.

ప్రస్తుత రేట్లకు అనుగుణంగా ఇవ్వాలి



పెరుగుతున్న నిత్యావసర వస్తువులకు అనుగుణంగా రెమ్యునరేషన్ పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం ఇచ్చే నామమాత్రపు కంటింజెంట్ చార్జి పరీక్షల నిర్వహణకు ఏ మూలకూ సరిపోవడం లేదు. ప్రభుత్వం వెంటనే సీఎస్, డీవోలతో పాటుగా ఇన్విజిలేటర్లకు కనీస చార్జీలు చెల్లించక పోవడం దురదృష్టకరం. వెంటనే ప్రభుత్వం రెమ్యునరేషన్ పెంచాలి.

– విత్తనాల శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి, గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్, అమలాపురం

రెమ్యూనరేషన్‌ను తక్షణం పెంచాలి



ప్రభుత్వం పరీక్షల నిర్వహణకు చేస్తున్న కేటాయింపులు ఏ మాత్రం సరిపోవడం లేదు. ఇన్విజిలేటర్లకు రోజుకు కనీసం రూ.150, ఛీఫ్, డీవో, కస్టోడియన్లకు రోజుకు రూ.200 వంతున కేటాయించాలి. ప్రభుత్వం దీనిపై వెంటనే స్పందించాలి.

– నరాల కృష్ణకుమార్, జిల్లా అధ్యక్షుడు, పీఆర్‌టీయూ, ద్రాక్షారామ

ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఏదీ..



పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం చేస్తున్న కేటాయింపులు చూస్తుంటే ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో తెలుస్తుంది. ఒక విద్యార్థికి ఒక పేపరుకు రూ.1.42 కంటింజెంట్ చార్జీగా ఏ విధంగా సరిపోతాయో చెప్పాలి. కష్టమైన బాధ్యతలు నిర్వహించేవారికి గౌరవప్రదంగా రెమ్యూనరేషన్ చెల్లించాలి.

– పి.సురేంద్రకుమార్, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్, కపిలేశ్వరపురం

టీఏ, డీఏలు చెల్లించాలి



దూరంతో సంబంధం లేకుండా సీఎస్, డీవోలకు, ఇన్విజిలేటర్లకు టీఏ, డీఏలు చెల్లించాలి. రెమ్యూనరేషన్ కచ్చితంగా పెంచాలి. స్పాట్ వాల్యుయేషన్ చేసే స్పెషల్ అసిస్టెంట్లకు కూడా టీఏ, డీఏలు చెల్లించాలి.

– పోతంశెట్టి దొరబాబు, జిల్లా అధ్యక్షుడు, ఎస్‌టీయూ, అమలాపురం

క్లుప్తంగా

22 కాసుల బంగారు ఆభరణాల చోరీ


నల్లజర్లలో చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నల్లజర్ల: స్థానికంగా గత రాత్రి భారీ చోరీ జరిగింది. నల్లజర్ల ఏఎస్‌ఐ సోమరాజు చెప్పిన వివరాల ప్రకారం నల్లజర్ల సొసైటీ రహదారిలో ఉన్న మారడుగల శ్రీనివాస్ ఈ నెల 15వ తేదీన బంధువుల ఇంట్లో శుభ కార్యానికి వెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చి చూడగా ఇంటి వెనుక తలుపులు పగులగొట్టి ఉండాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంట్లో ఉన్న 22 కాసుల బంగారు ఆభరణాలు, నాలుగు తులాల వెండి చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ దొంగల ఆగడాలు


విద్యుత్ స్తంభం నుంచి దొంగలు కిందకు దించిన టాన్స్‌ఫార్మర్

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని విద్యుత్ దొంగల ఆగడాలు రోజురోజుకి పెరిగిపోతున్నాయి. విద్యుత్ టాన్స్‌ఫార్మర్ పగుల గొట్టి దానిలో ఉన్న రాగి తీగ చోరీ చేస్తున్నారు. శనివారం రాత్రి మళ్లీ మూడు చోట్ల చోరీ ప్రయత్నం చేశారు. రెండు చోట్ల చోరీ జరిగింది. బలభద్రపురం గ్రామానికి చెందిన దార్వంపూడి సూర్యనారాయణ రెడ్డి, మరో రైతు పొలంలో చోరీ జరిగింది. పక్కనే ఉన్న ఎస్‌వీవీకే రెడ్డి పొలంలో చోరీ ప్రయత్నం చేశారు. ఆయన ట్రాన్స్‌ఫార్మర్ బోల్టులకు వెల్డింగ్ చేయించారు. దొంగలు దాన్ని బద్దలు కొట్టలేక అక్కడే వదిలి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

అత్తా కోడళ్లపై కౌంటర్ కేసుల నమోదు

రామచంద్రపురం రూరల్: ఒకరిపై ఒకరు దాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి అత్తా కోడళ్లు ఇద్దరిపైనా కౌంటర్ కేసులు నమోదు చేసినట్టు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు ఆదివారం విలేకరులకు తెలిపారు. కాకినాడలో నివాసం ఉంటున్న బొడ్డు ఉమా మహేశ్వరిని భర్త వదిలేసి వేరే వివాహం చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఉమా మహేశ్వరి శనివారం ఆమె అత్త బొడ్డు సత్యవతి నివాసం ఉంటున్న కందులపాలెం గ్రామానికి వచ్చి బంగారం కోసం ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్యా ఘర్షణ పెరిగి ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారు. ఇద్దరికీ గాయాలు కావడంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి సమాచారం, ఇద్దరి ఫిర్యాదులపై కౌంటర్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై భుజంగరావు తెలిపారు.

నేటి నుంచి ఓపెన్ టెన్త్ పరీక్షలు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 74 పరీక్షా కేంద్రాలు
- హాజరు కానున్న 5,947 మంది విద్యార్థులు

రాయవరం: పదవ తరగతి రెగ్యులర్ పరీక్షలతో పాటుగా, ఏపీ సార్వత్రిక విద్యా పీఠం ద్వారా పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభం కానున్నాయి. రెగ్యులర్ పది పరీక్షలతో పాటుగా ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు. ఏపీ సార్వత్రిక విద్యా పీఠం పది పరీక్షలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 28వ తేదీ వరకు జరగనున్నాయి. ఉమ్మడి జిల్లాలో 74 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 19 పరీక్షా కేంద్రాల్లో 1,195 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 29 పరీక్షా కేంద్రాల్లో 2,504, కాకినాడ జిల్లాలో 26 పరీక్షా కేంద్రాల్లో 2,248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు 74 మంది వంతున చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటుగా, 298 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా పరిష్కరించేందుకు 6304595699 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేశారు. ఈ నెల 17న హిందీ, 19న ఇంగ్లిషు, 21న తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 24న గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం, 26న శాస్త్ర, సాంకేతిక విజ్ఞానము, గృహ విజ్ఞానశాస్త్రం, 28న సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం పరీక్షలు నిర్వహించనున్నారు.

పశుమాంసం స్వాధీనం


పశు మాంసాన్ని తరలిస్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న గొల్లప్రోలు పోలీసులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం పాత వజ్రకూటం వైపు నుంచి అక్రమంగా తరలిస్తున్న పసు మాంసాన్ని ఆదివారం గొల్లప్రోలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వజ్రకూటం వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా ఒక వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా దానిలో వధించిన దున్నలను, పశువులను ఒలిచి పశు మాంసంను వ్యాన్‌లో తరలిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. దానిలో సుమారు 1,017 కేజీల పశుమాంసం ఉన్నట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకొని దానిని తరలిస్తున్న చెందుర్తికి చెందిన మిరియాల రమేష్, ఆరుగుళ్ళ తాతయ్య అనే తాతీలు, గండేటి రఘు అనే ముగ్గురు వ్యక్తులను, వ్యాన్‌ను అదుపులోకి తీసుకున్నామని గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పాత వజ్ర కూటం గ్రామ శివారులోని కొండ ప్రాంతంలో దున్నలను వధించి మాంసాన్ని హైవే ప్రాంతాల్లో హోటళ్లకు అమ్మడానికి తీసుకువెళ్తున్నామని వారు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. మాంసాన్ని వీఆర్వో పద్మశేఖర్ సమక్షంలో భూమిలో పాతి పెట్టి కేసు నమోదు చేసినట్టు గొల్లప్రోలు ఎస్సై ఎన్ రామకృష్ణ తెలిపారు.

పది పరీక్షల్లో మార్గదర్శకాలివే..



రాయవరం: పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి జిల్లా అంతటా ప్రారంభం కానున్నాయి. పరీక్షలను పక్కాగా నిర్వహించేందుకు జిల్లా విద్యా శాఖ ఇప్పటికే అన్ని చర్యలు చేపట్టింది. శనివారం మధ్యాహ్నం అన్ని పరీక్షా కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు సమావేశాలు నిర్వహించి సూచనలు, సలహాలు అందజేశారు. సీసీఈ విధానంలో ప్రారంభం అవుతున్న పది పరీక్షల్లో 15 నిమిషాలు పరీక్ష పేపరు చదువుకునేందుకు సమయాన్ని కేటాయిస్తున్నారు. పది పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో చీఫ్, డీవోలతో పాటు ఇన్విజిలేటర్లు చేయాల్సిన విధులపై 'సాక్షి' కథనం.

సీఎస్, డీవోలకు సూచనలు

- రోజూ ఉదయం 7.45 గంటలకు సెట్ కాన్ఫరెన్స్‌కు హాజరు కావాలి.
- నిర్దేశించిన సమయానికన్నా ముందు సీఎస్, డీవో ఇద్దరు సంతకాలతో పరీక్షల కట్టల సీల్ తెరవాలి.
- లాటరీ పద్ధతిలోనే ఇన్విజిలేటర్లకు తరగతి గదులు కేటాయించాలి.
- అనుమతి లేని వారిని పరీక్షా కేంద్రంలోకి అనుమతించరాదు.

ఇన్విజిలేటర్లకు సూచనలు

- ఇన్విజిలేటర్లు ఫొటో గుర్తింపు కార్డు తీసుకోవాలి. రోజూ తప్పకుండా ఐడీ కార్డు ధరించాలి.
- పరీక్ష పేపర్ల కోడ్స్, సరైన కాంబినేషన్ గురించి విధిగా తెలుసుకోవాలి.
- పరీక్ష రోజు ఉదయం 8.30 గంటలకు కేంద్రం వద్దకు హాజరు కావాలి.
- తొమ్మిది గంటలకు విద్యార్థులను పరీక్ష గదిలో కూర్చోబెట్టాలి. 9.30 గంటల తర్వాత విద్యార్థులను అనుమతించరాదు.
- ప్రతి విద్యార్థిని సోదా చేసి, ఎటువంటి ఫర్బిడెన్ మెటీరియల్ లేదని నిర్ధారించుకోవాలి.
- విద్యార్థినులను మహిళా ఇన్విజిలేటర్లు మాత్రమే సోదా చేయాలి.
- విద్యార్థులకు ఫొటో, అన్ని వివరాలతో కూడిన హాల్ టికెట్ అందిస్తారు. విద్యార్థిని హాల్ టికెట్, అటెండెన్స్ షీట్‌లోని ఫొటోతో పోల్చి నిర్ధారించుకోవాలి.
- అభ్యర్థిపై అనుమానం ఉంటే వెంటనే సీఎస్ దృష్టికి తీసుకుని వెళ్లాలి.
- అన్ని పరీక్షలు బార్ కోడింగ్ విధానంలో జరుగుతాయి. ఉదయం 8.45 గంటలకు ఓఎంఆర్ ప్రధాన/అదనపు సమాధాన పత్రాలు సీఎస్ నుంచి పొందాలి.
- ప్రధాన సమాధాన పత్రంలోని సూచనలను, ఓఎంఆర్ షీట్ వెనుక భాగంలో సూచనలు విద్యార్థులకు వివరించాలి.
- ఓఎంఆర్ షీట్ మినహా ఏ పేపర్‌పైనా కూడా హాల్ టికెట్ నంబరు, పేరు రాయించరాదు.
- ఓఎంఆర్ షీటు ఏదైనా కారణంతో పాడైతే, వెంటనే సీఎస్ దష్టికి తీసుకుని వెళ్లి, నాన్ స్టాండర్డ్ ఓఎంఆర్ షీట్ పొందాలి.
- ఓఎంఆర్ షీట్‌పై ఉన్న బార్‌కోడ్‌పై రాయడం గాని, నలపడం గాని చేయకుండా విద్యార్థులను హెచ్చరించాలి.
- 9.25గంటల లోపు ఇన్విజిలేటర్ అన్ని పనులు ముగించుకుని 9.30గంటలకు కచ్చితంగా ప్రశ్నపత్రాలు ఇవ్వాలి.
- ప్రశ్న పత్రాలు తీసుకున్న వెంటనే సరిపడినన్ని ఉన్నాయా? ఆ రోజుకు సంబంధించిన సబ్జెక్టు/పేపర్‌కోడ్/ మీడియం సరిచూసుకోవాలి.
- పేపరు ఏ మాత్రం తప్పుగా ఇచ్చినా సంబంధిత ఇన్విజిలేటర్‌పై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటారు. – గైర్హాజరైన విద్యార్థుల ఓఎంఆర్ షీట్‌ను ఎర్ర సిరా పెన్‌తో క్యాన్సిల్ చేయాలి.
- సమాధాన పత్రాలు, అడిషనల్ షీట్స్ అన్నీ సరిచూసుకున్నాకే విద్యార్థులను పంపాలి.

జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు నిత్యశ్రీ ఎంపిక


జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపికైన నిత్యశ్రీ

పిఠాపురం: జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పిఠాపురంనకు చెందిన ముమ్మిడి నిత్యశ్రీ ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో అత్యధిక స్కోరింగ్ కొట్టిన ఆధారంగా ఈ నెల 15వ తేదీన రాత్రి ఎంపికైన ఆర్చరీ లిస్టును విడుదల చేశారు. అందులో పిఠాపురం నుంచి ముమ్మిడి నిత్యశ్రీ ఎంపికయింది. ఈ నెల 22 నుంచి 29 వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీలో జరుగుతున్న 6వ జాతీయస్థాయి అండర్ 10 ఇండియన్ రౌండ్ బాలికల విభాగంలో ఆంధ్రప్రదేశ్ తరపున జాతీయస్థాయిలో ఆరేళ్ల ముమ్మిడి నిత్యశ్రీ ఎంపికైనట్టు కోచ్ పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షుడు కె.పద్మనాభం అభినందించారు.

ఆర్మీలో అగ్నివీర్ అవుతారా?

- అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో భారీ మార్పులు
- 13 భాషల్లో ప్రవేశ పరీక్ష రాసే అవకాశం
- ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమా అభ్యర్థులకు బోనస్ మార్కులు
- విశాఖలో మరోసారి ర్యాలీ
- ఏప్రిల్ 10 వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశం



రాజమహేంద్రవరం రూరల్: దేశ రక్షణ కోసం సైన్యంలో చేరాలనుకునే యువతకు శుభవార్త. అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రిక్రూట్‌మెంట్ చరిత్రలో తొలిసారిగా ప్రవేశ పరీక్షను ఏకంగా 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. ఇది తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మరోవైపు రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థుల కోసం ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి విశాఖపట్నం మరోసారి వేదిక కానుంది. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఈ రిక్రూట్‌మెంట్ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఇటీవలే విడుదలైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ అంబేడ్కర్, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ కృష్ణా, మచిలీపట్నం జిల్లాల అభ్యర్థులకు విశాఖలో ఎంపికలు నిర్వహించాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయం నిర్ణయించింది. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు ఏప్రిల్ 10వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్ కేటగిరీల కోసం ఈ రిక్రూట్‌మెంట్ నిర్వహిస్తున్నారు. అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్‌కు 8వ తరగతి, జనరల్ డ్యూటీ కేటగిరీలకు 10వ తరగతి అర్హతగా నిర్ణయించారు. అలాగే 17.5 నుంచి 21 సంవత్సరాల వయసు ఉన్న అభ్యర్థులే అర్హులు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేవారు మాత్రమే ఈ రిక్రూట్‌మెంట్‌కు హాజరు కావాలని అధికారులు స్పష్టం చేశారు.

ఈ ఏడాది కీలక మార్పులు

ఈసారి అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌లో పలు ముఖ్యమైన మార్పులు చేశారు. గతంలో అభ్యర్థులు ఒక కేటగిరీకి మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, ఈసారి రెండు కేటగిరీల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఎన్‌సీసీ, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమా వంటి అదనపు విద్యార్హతలు కలిగిన వారికి బోనస్ మార్కులు లభిస్తాయి. గతంలో హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మాత్రమే నిర్వహించిన కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను ఇప్పుడు తెలుగుతో సహా 13 భాషల్లో రాసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్లు ఆర్మీ రిక్రూట్‌మెంట్ బోర్డు వెల్లడించింది. రిక్రూట్‌మెంట్ ర్యాలీకి సంబంధించిన అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అడ్మిట్ కార్డులో ర్యాలీకి హాజరుకావాల్సిన తేదీ, సమయం వంటి వివరాలు ఉంటాయి. అభ్యర్థుల సౌకర్యం కోసం రిక్రూట్‌మెంట్ జరిగే ప్రదేశంలో ప్రత్యేక రిపోర్టింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్ విధానంలో పారదర్శకంగా జరుగుతుందని రక్షణ శాఖ వర్గాలు తెలియజేశాయి. అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం లైవ్ చాట్ సదుపాయంతో పాటు 'ఆర్మీ కాలింగ్' అనే ఆన్‌లైన్ మొబైల్ అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. మరింత సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు లేదా విశాఖపట్నంలోని ఆర్మీ రిక్రూట్‌మెంట్ కార్యాలయంలోని 0891- 2756959, 0891-2754680 నంబర్లకు ఫోన్ చేయాలని రక్షణ శాఖ అధికారులు సూచించారు.

సప్త గోదావరిలో పడి వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయం వద్ద సప్తగోదావరిలో ప్రమాదవశాత్తూ పడిన వ్యక్తి మృతి చెందాడు. ద్రాక్షారామ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాళ్ల సత్యనారాయణ గడచిన 20 సంవత్సరాలుగా ద్రాక్షారామలో నివాసం ఉంటూ పలు హోటళ్లలో పని చేసేవాడు. 8 సంవత్సరాలుగా ఒక టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. అయితే వారం క్రితం మద్యం సేవించి పనికి వస్తున్నాడని పని లోనికి రావద్దని పంపించేశారు. మద్యానికి బానిసైన అతడు, అనారోగ్యంతో కూడా బాధపడుతున్నట్లు చెబుతున్నారు. శనివారం రాత్రి సప్త గోదావరిలో పడి మృతి చెందినట్లు ఆదివారం గుర్తించారు. అతడికి అయిన వాళ్లు ఎవరూ లేకపోవడంతో స్థానికుల సాయంతో ద్రాక్షారామ పోలీసులు అంత్యక్రియలు నిర్వహించారు. ఘటనపై కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న 16 మంది అరెస్టు

కొత్తపల్లి: కోడి పందేలపై దాడి చేసి 16మందిని అరెస్టు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. మండలంలోని కొండెవరం శివారు కామన్నగారి దొడ్డి సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై జి.వెంకటేష్ తన సిబ్బందితో దాడి చేశారు. కోడిపందేలు ఆడుతున్న 16మందిని అరెస్టు చేసి 16 మోటారు సైకిళ్లను సీజ్ చేసి రూ.1920, రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నలుగురిపై వరకట్న వేధింపుల కేసు

కొత్తపల్లి: నలుగురిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఆదివారం పోలీసులు తెలిపారు. మండలంలోని కేపీఎస్‌ఈజెడ్‌కు చెందిన బీర రమణ, కాకినాడ రూరల్ రమణయ్యపేటకు చెందిన బీర విజయ్‌కుమార్‌కు గతంలో వివాహం జరిగింది. అదనపు కట్నం కోసం భర్త విజయ్‌కుమార్, అత్త బీర దయామణి, ఆడపడుచు ప్రసన్న, ఆమె భర్త సుధాకర్ వేధిస్తున్నారని రమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.